పుచ్చుకుని "దొడబిడగా దూర్చి" లడలొడగా త్రిప్పి గంయి మనిపించింది కార్నూ గీర్నూ !

శోభనాచలం నిర్ఘాంతపోతూ చూస్తూ, కారును వెళ్ళనిచ్చి, భార్య భగవంతమ్మతో "ఎప్పుడు నేర్చుకున్నావే ఈ విద్య నీవు ?" అన్నాడు. భగవంతమ్మ "వెధవది ! అదీ ఓవిద్దేటండీ? మీ యినప్పెట్టి తాళాలు రోజూ ముప్పయిసార్లు వేసి తీసేదాన్ని నాకు నా జబ్బల సత్తువ తెలియదటండీ !" అంది సగర్వ నిగర్వంగా.

.... .... .... .... ....

## సంగీత పరీక్ష

శ్రీనివాసరావు ఇంజనీరు (బి.యి) పరీక్షలో కృతార్థుడై తేనే గాని పెళ్ళి చేసికోనని బింకం పట్టుక్కూర్చొన్నాడు చాలాకాలం. కాని ఈ బింకం వట్టిబింకమేనని చాలామందికి తెలుసు. ఆ కారణం వల్ల పెళ్ళికి ఆడపిల్లలున్న వాళ్ళందరూ ఎప్పుడో వొకప్పుడు శ్రీనివాసరావుని అహ్వానం చేసి తమ అభిప్రాయం వెల్లడి చేస్తూ వచ్చారు. విఫలులూ అయ్యారు. క్రమంగా శ్రీనివాసరావు ఊహలు వర్ణనాతీతాలు అయిపోయి, కోరికలు గొంతెమ్మ కోరికలు అయినయ్. మరెవ్వరూ అతణ్ణి పిల్చి పిల్లనిస్తాం అనే వాళ్లు లేకపోయారు. శ్రీనివాసరావు చదువు పూర్తి అయినప్ప ట్నుంచి అస్తమానం సంగీత పరిశ్రమ చేసేవాడు. ఎక్కడన్నా జలపాతం చూచాడో అందలి విద్యుత్ప్రభావం ఎంత తెలిసికో

గలిగేవాడో అందలి లయజ్ఞానం అంత అలవఱచుకునేవాడు. గొప్ప మేధావి గొప్ప పరిశోధకుడూకూడాను శ్రీనివాసరావు.

చెప్పన్నదేశాల కన్నెపిల్లల్లోనూ వొప్పైనది, వన్నె చిన్నెలుగలది, వొయ్యార మొలకించేదీని "కీర" "కీర" కీర్తి ఎలాగో శ్రీనివాసరావు చెవిని బడింది. పిల్లకు సంగీతము వచ్చా అనే అతగాడి యక్షప్రశ్న! తతిమ్మా పరీక్ష లనవసరం అని కూడా అతగాడి మతం. పిల్లకు పెళ్ళికొడుకెలావుంటాడో చూదామనే భ్రమ, గొంతు కెల్లావున్నా సరే!

ఒక చోట పెళ్ళికాని ఆడపిల్ల, మరోచోట పెళ్ళికాని మగపిల్లవాడూ అంటూవుంటే, ఎల్లాగైనా వాళ్ళిద్దరూ అన్యోన్యం చూచుకోక మానరు. ఎంత జరగదన్నా! ఎంత బ్రహ్మవిరుద్ధ భావంతో ఉన్నా!

"కీర" అపురూపంగా పాడేస్తూవుంది. పాటతో సరి సమానంగా వాయులీనుమీద కమాను యీడుస్తూ వుంది. ఎలా వుంది పిల్ల? ఎత్తికుదీస్తే ఎగిరి తూలేలాగుంది! శ్రీనివాసరావు ఎక్కడన్నా లయతప్పుతుందా పట్టుకుందాం అనే విమర్శనా దృష్టి విడిచిపెట్టకుండా, పెళ్ళికొడుకు చూపులు చూస్తూవున్నాడు. తన చేతులతో తాళం వేస్తూ తల వూపుతూ "బలే! బాగు! బళా!" అని హెచ్చరిస్తూవున్నాడు. "కీర" అపురూపంగా కేలూ కమానూ ఎంత దూరంలాగేసిందంటే వోతూరి, నే చెప్ప లేను! కొండనుండి చెట్టుశాఖ సాగి సాలిపురుగును గెంతించినట్లు మెలయించిందనుకోండి కమాన్నూ కేల్నూ, కేల్నూ కమాన్నూ వక్షోజయుగళి నిలుకడనే!

అంత బాగా పెళ్ళికూతురు వాయిస్తూ పాడుతూవుంటే శ్రీనివాసరావు "ఛెస్సి తగలేశావ్! బంగారంలాంటి కృతి!

తాళం తప్పింది! తప్పిందే! ఛెస్సి తాళం తప్పిందే!" అని కేకేశాడు. "కీర" వెంటనే ఫిడేలు అక్కడ పడేసి "ఏమయ్యో! పెళ్ళి కాకుండానే హాములు చేస్తున్నావు!" అంది పయ్యంట కంట నొత్తుకు వెడవెడలేస్తూ. పెళ్ళికూతురు తల్లి "చూపులు చూపులే, సంగీతం సంగీతమే! చూపుల కొచ్చి పరీచ్చలేమిటి? ఆ మాత్రం స్వతంత్రం లేకపోతే అమ్మకడుపున బుట్టి బ్రదికే దెట్లా? అస్తమానం పెళ్ళికాని ముందప్పట్నుంచీకూడా మగాడితో లయకలిపి పాడాలీ అంటే చావుకాదూ ఆడదానికి!" అని రంయిమంది. "పెళ్ళయాక మట్టుకు?" అని గంయిమంది కీర పెద్దప్పగోరు. కీర తండ్రి "పెళ్ళయ్యాక పప్పపా చొచ్చాచో వేయిలాంటి వాళ్ళకు" అన్నాడు శ్రీనివాసరావును చూపుతూ.

శ్రీనివాసరావు సవిమర్శగా అనబోయాడు "అదేమిటండీ అలా అంటారు? నేను సరియైన లయ చూపెడతాను ఇదిగో" అని వేయబోయాడు మళ్ళీ కృతికి సరియైనతాళం తాను........ ఆపాళంగా పెళ్ళికూతురు తండ్రి శ్రీనివాసరావు చెయి పట్టుకుని లయ కట్టిపెట్టించి, "చూడు అబ్బాయీ! మా పిల్లకు నేను చెప్పించింది పెళ్ళి సంగీతం. పెళ్ళి సంగీతం అన్నది చూడాలి సిందేగాని వినవలసింది కాదు. ఫఫఫఫఫ" అన్నాడు. శ్రీనివాసరావు "వెఱ్ఱి మామా! నా మతంలో సంగీతం అన్న దెలాంటిదీ అంటే—పశుర్వేత్తి, శిశుర్వేత్తి—" కీర తండ్రి "తెఱ్ఱల్లుడా! నా మతంలో సంగీతం అంటే ఎలాంటిదీ అంటే, మగాళ్ళదైతే పశువుల కోసం, ఆడాళ్ళదైతే శిశువుల కోసం, రెండూ కానివాళ్ళదైతే నాగుబాముల కోసం అని—"

శ్రీనివాసరావు "అతి (too much) కి పోయి సిద్ధాన్నాన్ని చెడగొట్టుకున్నానే" అని చింతించేడు.

మర్నాడు గాన సభ! "కీర" "చింతింప నేమి ఫలము" అన్న కృతి విసిరింది. శ్రీనివాసరావు సభలో మునుముందు కూర్చుని లయవేస్తూ "అపర శారదా!" అని అభినందించాడు! కీర పాట అవుతూ "లయ విశారదులకు జోహారు" అంది.

.... .... .... .... ....

## ఓ యి చం ద మా మా

"రైల్వే ప్లాట్‌ఫారమే చాలా తొడ తొక్కిడిగా వున్నప్పుడు రైల్లో ఎంత ఇరకాటకంగా వుండేనో" అంటూ దృష్టి ఆనించి, ఇంటర్ క్లాసుబండియొక్క లోనికి జొరబడే సందు గుమ్మం వెలుపలి రెండు ఇనుపకమ్మలు ఆలా రెండుచేతులా లాగిపట్టినట్టు పట్టి, ఒక్క ఊపున తన వెనుకవున్న జనాన్ని నెట్టి, ముందుకు చొఱబడి, ఎలాగైతేం ఎక్కగలిగింది ఆనాడు అమ్మత్తకాశిని—ఆమె పేరు మధుపాత్ర.—"మధు" అని కూడా పిలవడం ఆమెను ఎఱుగున్నవారి కలవాటేమో కూడా—ఎంచేతా అంటే, ఆమె వెనువెనుకనే ఎక్కే గుంపులోంచి ఒక యువకుడు "మధు ఎక్కగలిగింది బండి! నేనే వెనకబడిపోయినాను. గార్డు ఈలవేశాడు" అనే నిరాశాపూర్వకమైన, ఆయాసభారమైన ఆత్మీయవాక్యం గట్టిగా అనుకోవడం వినవచ్చింది. మధుపాత్ర అప్పటికప్పుడే ఆలా ఆలా ఒక అరలోకి ఇమిడి, కిటికీగుండా ప్లాట్‌ఫారమ్ మీదికి తొంగిచూస్తూ, "ఇలా రావోయి! ఈ కిటికీగుండా దూరవోయి! దీపాలుకూడా లేవు వెధవ బండీకి!" అని